# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 155 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

21-04-2026 మంగళవారం వెల : 1 /- పేజీలు : 4


# తూనికల శాఖ హడావిడి..

# తనిఖీలు ఎక్కడ?








- పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో అవగాహన పేరుతో కార్యక్రమం
- ఫోటో సెషన్‌కే పరిమితమైందని స్థానికుల విమర్శలు
- తప్పుడు తూనికలు, కొలతలపై తనిఖీలు లేవని ఆరోపణ
- అకస్మిక తనిఖీలు చేపట్టాలని వినియోగదారుల డిమాండ్
- రోజూ వందలాది మంది కొనుగోళ్లు చేసే ప్రధాన మార్కెట్
- నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు కోరుతున్న ప్రజలు
- క్షేత్రస్థాయిలో శాఖ పనితీరు మెరుగుపరచాలని సూచనలు
- నిరంతర తనిఖీలకు ఉన్నతాధికారులు స్పందించాలని విజ్ఞప్తి

**నవతరం ప్రతినిధి - శ్రీకాకుళం**

శ్రీకాకుళం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపానగల పొట్టి శ్రీరాములు మార్కెట్ లో ఆదివారం ఉదయం తూనికలు కొలతల శాఖ అధికారులు నిర్వహించిన కార్యక్రమం స్థానికంగా చర్చనీయాంశమైంది. వినియోగదారుల హక్కులను కాపాడుతూ మార్కెట్‌లో తప్పుడు తూనికలు, కొలతలపై తనిఖీలు నిర్వహించాల్సిన శాఖ అధికారులు కేవలం వచ్చి ఫోటోలు తీయించుకోవడం, కొద్దిసేపు హడావిడి చేసి వెళ్లిపోవడం మాత్రమే కనిపించిందని వ్యాపారులు, స్థానికులు విమర్శిస్తున్నారు.

ఆదివారం ఉదయం శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది మార్కెట్ ప్రాంతానికి చేరుకుని అవగాహన కార్యక్రమం పేరుతో బ్యానర్లు ప్రదర్శించారు. మార్కెట్‌లోని కొన్ని దుకాణాల ఎదుట నిలబడి మాట్లాడినట్లు, సూచనలు ఇచ్చినట్లు కనిపించారు. అనంతరం ఫోటోలు తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అయితే ఈ కార్యక్రమంలో అసలు తనిఖీలు, కొలతల పరిశీలన, తప్పుడు తూనికల తనిఖీ వంటి చర్యలు కనిపించలేదని స్థానికులు అంటున్నారు.

పొట్టి శ్రీరాములు మార్కెట్ పట్టణంలో ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది వినియోగదారులు ఇక్కడికి వస్తుంటారు. కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, కిరాణా సరుకులు కొనుగోలు చేసే సమయంలో వినియోగదారుడు ఇచ్చే డబ్బుకుబి సరైన తూకవ గల సరుకు ఇస్తున్నారా? తూనికలు సక్రమంగా ఉన్నాయా? కొలతల్లో ఎలాంటి మోసాలు జరుగుతున్నాయా? అనే అంశాలు తరచూ చర్చకు వస్తుంటాయి. ఇలాంటి చోట తూనికలు కొలతల శాఖ తనిఖీలు కీలకంగా భావించబడుతున్నాయి.

ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ నిజంగా ప్రజలకు మేలు చేయాలంటే అకస్మిక తనిఖీలు నిర్వహించి, తప్పుడు తూనికలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. తక్కువ బరువు చూపించే యంత్రాలు, సర్టిఫికేషన్ లేని తూనికలు, గడువు ముగిసిన కొలత పరికరాలపై కఠిన చర్యలు తీసుకుంటేనే వినియోగదారులకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. నిజాయితీగా వ్యాపారం చేసే వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. కొందరి తప్పిదాల వల్ల మొత్తం మార్కెట్‌కు చెడ్డపేరు వస్తోందని, శాఖ అధికారులు మొక్కుబడిగా ఎ తనిఖీలు నిర్వహిస్తే మార్కెట్‌పై నమ్మకం ఉండదని కావున కచ్చితంగా తూనికల కొలతలు శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు

కానీ ఆదివారం జరిగిన కార్యక్రమంలో అలాంటి కనీస చర్యలు కనిపించలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. బ్యానర్లు, ఫోటోలు, కొద్దిసేపు అవగాహన ప్రసంగాలు మాత్రమే జరిగాయని, తర్వాత అధికారులు వెళ్లిపోవడంతో కార్యక్రమం ముగిసిపోయిందని చెబుతున్నారు.

ప్రజల ప్రయోజనాల కోసం ఏర్పాటైన శాఖలు క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే ఫలితం ఉంటుందని, కేవలం ఫోటో కార్యక్రమాలతో సమస్యలు పరిష్కారం కావని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్ ప్రాంతంలో నిరంతర తనిఖీలు, ఫిర్యాదు వ్యవస్థ బలోపేతం, తప్పుడు తూనికలపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్డీఏ ప్రచారంలో రామ్మోహన్ నాయుడు

- చంద్రబాబుతో కలిసి మేధావులు, పారిశ్రామిక వేత్తలతో సమావేశం
- అభ్యర్థులకు ఘన విజయం అందించాలని పిలుపు




**నవతరం -తమిళనాడు**

తమిళనాడులోని కోయంబత్తూరులో ఎన్డీఏ అభ్యర్థుల తరపున నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కేంద్ర పౌర

-మిగతా 2లో

## పదేళ్లకోసారి వచ్చే అరసవల్లి అసిరితల్లి సిరిమానోత్సవం

- భక్తులకు ఇబ్బందులు లేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలి
- లక్షలాది మంది రాకతో అధికార యంత్రాంగం అప్రమత్తం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమీక్ష
- ఎస్పీ, ఎమ్మెల్యేతో కలిసి ఏర్పాట్ల పరిశీలన

2లో



## 2026 ప్రతిభా పుష్కర వేడుకలో ఐటెం కళాశాల ఘన విజయం



- 70 కంపెనీలలో 800 మందికి ఉద్యోగాలు
- 33 లక్షల గరిష్ఠ ప్యాకేజీ
- 4 లక్షల కనిష్ఠ వేతనంతో నియామకాలు
- విద్యార్థులకు అభినందన పత్రాల ప్రదానం
- జూన్ వరకు కొనసాగనున్న క్యాంపస్ ఎంపికలు

2లో

ఎడిటోరియల్

# పెరుగుతున్న పూర్ణమ్మలు

పుస్తకాలు పట్టాల్సిన చిట్టితల్లులు బాల్యంలోనే పెళ్లి పీటలెక్కుతున్నారు. అన్నెంపున్నెం ఎరుగని ఆ పుత్తడిబొమ్మల మెడలో పుస్తెలతాడు ఉరితాడులా మారి ఉచ్చు బిగిస్తోంది. తెలిసీ తెలియని వయసులో పట్టుమని పదహారేండ్లు కూడా నిండని ముక్కుపచ్చలారని ఆ పసిమొగ్గలు కుటుంబ బరువు, బాధ్యతల బందీఖానాలో చిక్కి శల్యమైపోతున్నారు. పెండ్లంటే ఏమిటో తెలియకుండానే చిన్నారులు అగాథంలో కూరుకుపోతున్నారు. మోయలేని పేదరికం ఆడపిల్ల భారం తీరుతుందని కన్నోళ్లే సంసారం అనే సాగరంలోకి నెట్టేస్తున్నారు.
బాల్యవివాహాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాలు, పేద కుటుంబాల్లోనే జరుగుతున్నాయి. చిన్న వయసులోనే గర్భం దాల్చి అనారోగ్యం బారిన పడి ఎన్నో జీవితాలు ఆహుతి అవుతున్నాయి.
తెలంగాణలో బాల్య వివాహాల విషయంలో ఆందోళనకర పరిస్థితి కనిపిస్తోం దని సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చెబుతోంది. రాష్ట్రంలో సుమారు ఐదు శాతం అమ్మాయిలు... అంటే సుమారు 2.16 లక్షల మంది బాలికలకు 18 ఏండ్ల లోపే పెండ్లి చేస్తున్నారని సర్వేలో గుర్తించారు. చట్టపరమైన నిషేధం ఉన్నప్పటికీ.. సామాజి కంగా ఇంకా కొనసాగుతున్న సమస్యగా కనిపిస్తోంది. అభివృద్ధికి కేవలం ఆర్థిక ప్రమాణా లనే కాకుండా.. మహిళల స్థితిని కూడా సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని ఈ పరిణామాలను చూస్తే అర్థమవుతోంది. ఆర్థిక ఇబ్బందులు, త్వరగా పెళ్లిచేసి బాధ్యతలు తీర్చుకోవాలనే భావనతో చిన్నారులను చదువుకోవాలన్న ఆకాంక్షల నుంచి దూరం చేస్తున్నారు. తెలంగాణ మహిళల్లో సుమారు 65.5శాతం మంది పదోతరగతి దాటి చదవలేకపోతున్నారు. అంటే రాష్ట్రంలోని ప్రతి ముగ్గురు మహిళల్లో ఇద్దరు కనీసవిద్యను కూడా పూర్తి చేయడం లేదు. ఇది మహిళల అభివృద్ధి, సామాజిక పురోగతికి పెద్ద అడ్డంకిగా మారుతోంది.
ప్రత్యేకంగా గిరిజన వర్గాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. బాల్యవివాహాలపై క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా తల్లిదండ్రులు ఈ సామాజిక దురాచారం నుంచి బయటపడలేక పోతున్నారు. రోజుకు మూడు చొప్పున కేసులు మన రాష్ట్రంలోనే నమోదవు తున్నాయి. బాల్య వివాహాల నిరోధక చట్టం, చైల్డ్‌లైన్‌పై అవగాహనతో ఎవరైె నా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తేనే ఈ కేసులు వెలుగులోకి వస్తున్నాయి. గుట్టు చప్పుడు కాకుండా జరుగు తున్న బాల్య వివాహాలకు లెక్కేలేకుండా పోతోంది. "మేలిమి బంగరు మెలతల్లారా.. కలువల కన్నుల కన్నెల్లారా.. తల్లులగన్నా పిల్లల్లారా.. విన్నా రమ్మా ఈ కథను.." అంటూ గురజాడ అప్పారావు బాల్యవివాహపు ఉక్కుకోరల్లో చిక్కు కుని బలైపోయిన బాలిక గురించి రాసిన దీనగాథ "పుత్తడిబొమ్మ పూర్ణమ్మ" కథ. ఆ పూర్ణమ్మల కథలు నేటికీ కొనసాగుతుండటం అత్యంత విషాదం.
రాజధాని పరిసర ప్రాంతాలు సైతం అభివృద్ధిలోనే కాదు.. సామాజిక వెనుకబాటులోనూ ముందుండటం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసినా అది నిష్ఠుర సత్యం. గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరగడానికి కారణం అవిద్య, అవగాహనా లేమి కారణాలుగా కనిపిస్తున్నాయి. సమాజాన్ని ఆవరించిన అభద్రతా భావం కూడా ఆడపిల్లలకు శాపంగా మారింది.
పిల్లలకు సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగడానికి, అభివృద్ధి చెందటానికి రక్షణ పొందే హక్కును రాజ్యాంగం కల్పించింది. బాల్య వివాహం వారి హక్కులను హరిస్తుంది. ఆడపిల్లలు అంతరిక్షంలోకి వెళ్తున్న నేటికాలంలో కూడా ఇప్పటికీ దేశంలో బాల్య వివాహాలు జరగడానికి కారణాలేమిటి? కేవలం అభివృద్ధిలోనే కాకుండా ప్రజల ఆలోచనల్లోనూ వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తోంది. సమాజం ఎప్పుడో వదిలేసిన అమా నుష ఆచారాలు కొనసాగుతున్నంత కాలం ఎన్ని చట్టాలు వచ్చినా నిరూపయోగమే. నేడు హిందూత్వ ఎజెండాను బలంగా అమలు చేస్తున్న మనువాదుల పాలనలో ఉన్నాం. పాలకగణం చట్టాలను అమలు చేయడం కంటే ప్రజలను అశాస్త్రీయత వైపు నడిపించడానికే ప్రాధాన్యత ఇస్తున్నది. దాని ఫలితం చట్ట విరుద్ధమని తెలిసినా ఇప్పటికీ బాల్య వివాహాలు ఆగడంలేదు. దీని కారణంగా రానున్న దశాబ్దంలో కోట్లాది మంది బాలికలు బాల్య వివాహాల ఊబిలో కూరుకుపోయే ప్రమాదంఉందని యునిసెఫ్ హెచ్చరించింది. ఏదిఏమైనా బాల్యవివాహాల దురాచారం సమర్థనీయం కాదు. దీన్ని అరికట్టినప్పుడే యువతులకు వ్యక్తిగత స్వేచ్ఛ, ఎంపికలకు అవకాశం ఉంటుంది. తద్వారా మహిళా సాధికారతకు మేలైన బాట పడుతుంది. దేశం పురోగతి సాధిస్తున్న క్రమంలో మహిళలకు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వస్తుండ టంపై చైతన్యం కల్పించడం ద్వారా బాల్యవివాహాలను నిరోధించాలి. ప్రజల్లో అవగాహన పెంచి, భయం పోగొట్టి, మహిళలకు, ఆడపిల్లల భద్రతకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప ఈ బాల్య వివాహాల్ని అడ్డుకోవడం కష్టం.

# శ్రీకాకుళంలో ఉచిత వైద్య శిబిరం

## టీపీఎంహెచ్ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు వైద్య సేవలు

**నవతరం -శ్రీకాకుళం**



నగరంలోని టీపీఎంహెచ్ పాఠశాలలో సోమవారం జేమ్స్ ఆస్పత్రి సహకారంతో టీడీపీ నాయకులు కృప సాగరం నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ మహిళా నాయకురాలు గొండు స్వాతి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం గొండు స్వాతి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ప్రతిరోజూ వ్యాయామం, యోగా చేయాలని సూచించారు. 31వ డివిజన్ ఇంచార్జ్, ఏపీ కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సూరిబాబు మాట్లాడుతూ, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం సంతోషకరమన్నారు.
ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఇందిరమణి, బీజేపీ నాయకులు సురేష్ సింగ్, వైద్యులు సోమేశు, టీడీపీ కార్యకర్తలు రాము, పాపారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, తారక రామారావు, శ్రీధర్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ ప్రచారంలో రామ్మోహన్ నాయుడు

**మొదటి పేజీ తరువాయి**
విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి మేధావులు, పారిశ్రామికవేత్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులతో సమావేశంలో పాల్గొన్నారు. దేశ అభివృద్ధి, రాష్ట్ర ప్రగతి కోసం ఎన్డీఏ అభ్యర్థులను ఘనమైన మెజారిటీతో గెలిపించాలని రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. తమిళనాడులో కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# పదేళ్లకోసారి వచ్చే అరసవల్లి అసిరితల్లి సిరిమానోత్సవం

**నవతరం -శ్రీకాకుళం**





పదేళ్లకోసారి అత్యంత వైభవంగా జరిగే అరసవల్లి అసిరితల్లి సిరిమానోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి అరసవల్లి మున్సిపల్ మైదానంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్తో కలిసి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 28న జరిగే ప్రధాన సిరిమానోత్సవానికి లక్ష మంది, ఏప్రిల్ 29న పండుగ భోజనాలకు సుమారు ఐదు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్, విద్యుత్, అగ్నిమాపక శాఖలు ప్రత్యేక కార్యాచరణతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.
శోభాయాత్ర మార్గాల్లో విద్యుత్ తీగలు అడ్డంగా ఉండకూడదని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అన్నారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.
అలాగే ఏప్రిల్ 25 నుంచి ప్రారంభమయ్యే సాంస్కృతిక కార్యక్రమాలు, 26న జరిగే శోభాయాత్ర దృష్ట్యా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీని కోరారు. ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధల మధ్య జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఈ సమావేశంలో ఆర్డీఓ సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, మున్సిపల్ కమిషనర్ కూర్మారావు, తహసీల్దార్ గణపతిరావు, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# 2026 ప్రతిభా పుష్కర వేడుకలో ఐటెం కళాశాల ఘన విజయం

**నవతరం -టెక్కలి**

టెక్కలిలోని ఐటెం కళాశాలలో సోమవారం 2026 ప్రతిభా పుష్కర వేడుక ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, సెక్రటరీ ఎల్.ఎల్. నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ అభినందన పత్రాలు అందజేశారు. కళాశాల యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం, 70 ప్రముఖ కంపెనీలలో 800 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. వీరిలో అత్యధికంగా 33 లక్షల వార్షిక వేతనం, కనిష్టంగా ?4 లక్షల ప్యాకేజీతో నియామకాలు జరిగాయి.
ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ, మొదటి ఏడాది నుంచే విద్యార్థులకు విలువల ఆధారిత శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించడం వల్లే ఈ స్థాయి విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఇంకా పలు కంపెనీల నియామక ప్రక్రియలు కొనసాగుతున్నాయని, వచ్చే జూన్ నెల వరకు క్యాంపస్ ఎంపికలు కొనసాగనున్నాయని వెల్లడించారు.
అలాగే ప్రస్తుత విద్యా సంవత్సరంతో పాటు 2025 పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థులకు కూడా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ఎస్. శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ ఎం. సంతోష్ కుమార్, వివిధ విభాగాల డీన్లు, శాఖాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదాన సేవలో నేను కూడా భాగమౌతా

- ఉర్లం.శివతేజ పట్నాయక్ సేవలు కొనసాగాలి
- టీడీపీ క్లస్టర్ ఇంచార్జి ఉంగటి.రమణ మూర్తి

**నవతరం -శ్రీకాకుళం**



అన్నదాన సేవలో నేను కూడా భాగమౌతానని, అందరివాడు, టీడీపీ క్లస్టర్ ఇంచార్జి ఉంగటి.రమణ మూర్తి అన్నారు. నగరంలో స్థానిక పట్టణ నిరాశ్రయుల భవనంలో అభాగ్య కుటుంబాలకు అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగముగా ఈ రోజు టీడీపీ క్లస్టర్ ఇంచార్జి ఉంగటి.రమణ మూర్తి పాల్గొని, అన్నార్థుల అవసరాలకు సహకారం అందించి, అన్నవితరణ చేపట్టి మాట్లాడుతూ ఉర్లం.శివతేజ పట్నాయక్ అందిస్తున్న సేవలను, ప్రతి రోజు పరోక్షంగా చూస్తున్నానని, ఈ రోజు ప్రత్యక్ష్యంగా చూశానని, ఆయన సేవలు అనివార్యమన్నారు. ఆర్థిక స్థోమత లేకున్నా నిరంతరం సేవే శ్వాసగా నిలుస్తున్నారన్నారని, అటువంటి వ్యక్తి సేవలో నేను పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. నాకు వీలున్నంతవరకు, శివతేజతో కలసి, ప్రతీ నెలలో ప్రతీ ఆదివారం ఉదయం, మధ్యాన్నం, రాత్రి వేళలో అన్నవితరణ చేపడతానని, కొన్ని వేడుకలకు ధనాన్ని వృధా చేయకుండా, ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం షెల్టర్ నిర్వాహకురాలు వైశ్యరాజు.వెంకట లక్ష్మి, ప్రత్యేక అవసరాలు తీరుస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థకు, వైద్యసేవలు అందిస్తున్న లయన్స్ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షురాలు డా. పైడి సింధూర, వారి బృందానికి, అత్యవసర వైద్య సేవలందిస్తున్న అరసవల్లికి చెందిన పేదల వైద్యులు డా. ఇంజరాపు. మోహన్ రావుకు, షెల్టర్ అవసరాలకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్న సామాజిక సేవకులు ఉర్లం.శివతేజ పట్నాయక్ కు ప్రత్యేక ధన్యవాదాలన్నారు.
ఈ కార్యక్రమంలో పట్టణ నిరాశ్రయుల భవన నివాసకులు, షెల్టర్ నిర్వాహకులు, సామాజిక సేవకులు, ఉర్లం.శివతేజ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సోంపేట స్టేషన్ నిర్లక్ష్యం ఆపాలి

- బీసీ సంక్షేమ సంఘం ఘాటు హెచ్చరిక
- ప్లాట్‌ఫారం-1 ప్రారంభం, ఎక్స్‌ప్రెస్ హాల్ట్ డిమాండ్
- చర్యలు లేకపోతే ఉద్యమం తప్పదని స్పష్టం

**నవతరం -కంచిలి**




సోంపేట రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విశాఖ డివిజనల్ రైల్వే మేనేజర్‌కు జాయింట్ పిటిషన్ సమర్పించింది.
సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సిపాన గుణవతి మాట్లాడుతూ, 120కుపైగా గ్రామాల ప్రజలు సోంపేట స్టేషన్‌పై ఆధారపడుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్లాట్‌ఫారం-1 మూసివేతతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.
స్టేషన్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, వెయిటింగ్ హాల్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పూరి-అహ్మదాబాద్, యశ్వంత్‌పూర్, వందే భారత్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే ఉద్యమంతో పాటు న్యాయపరమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# జీడి, మొక్కజొన్నకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని రైతు సంఘాల డిమాండ్

**నవతరం -శ్రీకాకుళం**



జిల్లాలో జీడి, మొక్కజొన్న పంటలకు వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేశాయి. జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పిస్తూ, జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు ?16,000 మద్దతు ధర ప్రకటించాలని, అలాగే మొక్కజొన్నకు ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాల్‌కు 2,400 చెల్లించి కొనుగోలు చేయాలని కోరారు. రైతులు నష్టాల్లో ఉన్న నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకొని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

# ఎస్సై నుంచి ఎస్పీ... గన్నవరం గర్వం!





- రైతు కుటుంబం నుంచి రాష్ట్రస్థాయి గుర్తింపు
- చిన్ననాటి కలను నిజం చేసిన ఖాకీ వీరుడు
- ఎస్సైగా మొదలై ఎస్పీ హోదా వరకూ విజయం
- క్రమశిక్షణ, పట్టుదలతో శిఖరాగ్రానికి చేరిన అధికారి
- పల్లె బిడ్డగా పుట్టి ప్రజల గుండెల్లో నిలిచిన పేరు
- యువతకు స్ఫూర్తిగా నిలిచిన నక్కా సూర్య చంద్రరావు

**పుట్టింది పల్లెలో... పెరిగింది సాధారణ కుటుంబంలో... కానీ ఆలోచనలు మాత్రం అసాధారణం. చిన్నతనంలో పోలీస్ శాఖలో ఉన్నతాధికారిగా ఎదగాలని వేసుకున్న లక్ష్యం... దశాబ్దాల కష్టంతో నిజమైంది. ఎస్సైగా ప్రారంభమైన అడుగు... ఎస్పీ హోదా వరకు దూసుకెళ్లింది. కష్టాన్ని ఆయుధంగా, క్రమశిక్షణను బలంగా మార్చుకుని రాష్ట్రవ్యాప్తంగా గొప్ప గుర్తింపు తెచ్చుకున్న పేరు నక్కా సూర్య చంద్రరావు. నేడు విజయవాడ ట్రాఫిక్ డీసీపీగా సేవలందిస్తూ గన్నవరం నేల గర్వంగా నిలిచారు.**

**నవతరం ప్రతినిధి పి.గన్నవరం**



1964 ఏప్రిల్ 15న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పి.గన్నవరం మండలం బోడపాటివారిపాలెం గ్రామంలో నక్కా శేషగిరిరావు, సూర్యకాంతం దంపతులకు జన్మించిన సూర్య చంద్రరావు... చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగారు. ప్రాథమిక విద్యను స్వగ్రామంలో పూర్తి చేసి, పి.గన్నవరం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. అనంతరం మలికిపురంలో ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేశారు.

చదువులోనూ ప్రతిభ కనబరిచిన ఆయన బీయిడ్ ప్రవేశ పరీక్షలో రాష్ట్రవ్యాప్తంగా 9వ ర్యాంకు సాధించారు. రాజమండ్రిలో బీయిడ్ చదివినా... మనసులో మాత్రం ఖాకీ కల ఎప్పుడూ సజీవంగానే నిలిచింది. అదే దీక్షతో 1989 బ్యాచ్‌లో ఎస్సైగా ఎంపికై, హైదరాబాద్ అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసి విధుల్లోకి అడుగుపెట్టారు.

కృష్ణా జిల్లాలో పెనమలూరు, గన్నవరం, కృష్ణలంక, విజయవాడ, సత్యనారాయణపురం, టూటౌన్, ఎస్‌ఆర్‌పేట, పాలకోడేరు, పెదవేగి ప్రాంతాల్లో సేవలందించారు. సమర్థత, క్రమశిక్షణతో పనిచేసిన ఆయన సీఐగా పదోన్నతి పొంది గుడివాడ రూరల్, తుని, తాడేపల్లిగూడెం, అవనిగడ్డ, ఏలూరు ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు.

తరువాత డీఎస్పీగా విజయవాడ సిటీ ఎస్‌బి, తిరుపతి రైల్వే డివిజన్, నెల్లూరు, విశాఖ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, విజయవాడ సౌత్‌జోన్ ఏసీపీగా విశేష సేవలందించారు. అనంతరం ఏఎస్పీగా విజయనగరం జిల్లా పార్వతీపురం, ప్రకాశం, ఏలూరు జిల్లాల్లో ఎస్‌ఈబీ జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.
అనుభవం, నిబద్ధత, నిజాయితీకి గుర్తింపుగా ఆయనకు ఎస్పీగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం విజయవాడ ట్రాఫిక్ డీసీపీగా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు.



వ్యక్తిగత జీవితంలోనూ ఆయన ఆదర్శవంతుడే. 1991 మే 16న సూర్య భవానితో వివాహం జరిగింది. ముగ్గురు సంతానం ఉన్నారు. పెద్ద కుమార్తె యోగితాభవ్య, అల్లుడు లోహిత్ ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. రెండవ కుమార్తె రఘుమ అమెరికాలో వైద్యురాలిగా సేవలందిస్తున్నారు. కుమారుడు ఈశ్వర్ నాయుడు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. పల్లెటూరి బాలుడు... పట్టుదలతో ముందుకు సాగితే రాష్ట్ర పోలీస్ శాఖలో ఎస్పీ స్థాయికి చేరగలడని సూర్య చంద్రరావు నిరూపించారు. నేడు బోడపాటివారిపాలెం ప్రజలు... తమ ఊరి బిడ్డ విజయాన్ని గర్వంగా చెప్పుకుంటున్నారు.కల ఉంటే గెలుపు సాధ్యం...
పట్టుదల ఉంటే శిఖరం అందుబాటులోనే ఉంటుంది... నక్కా సూర్య చంద్రరావు జీవితం అందుకు నిలువెత్తు నిదర్శనం.



# వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



- జై బజరంగ్ దళ్‌తో కలిసి సేవా కార్యక్రమం
- శిబిరాన్ని ప్రారంభించిన సూర శ్రీనివాసరావు
- రక్తదానానికి యువత ముందుకు రావాలని పిలుపు
- రక్తదాతలకు మెడల్స్, ధ్రువపత్రాల అందజేత

**నవతరం-శ్రీకాకుళం**

విశ్వహిందూ పరిషత్, జై బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సూర శ్రీనివాసరావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానానికి యువత పెద్దఎత్తున ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై ఉన్న అపోహలు తొలగాలని, రక్తదానం చేయడం వల్ల లాభమే తప్ప నష్టం లేదన్నారు. రక్తదాతలను అభినందిస్తూ వారికి మెడల్స్, ధ్రువపత్రాలు అందజేసి సేవాతత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, డాక్టర్ పీజే నాయుడు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన పథకానికి రూ.1 లక్ష విరాళం

## అరసవల్లి దేవస్థానానికి సింహాద్రి మంజులత అందజేత

**నవతరం-శ్రీకాకుళం**



అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలోని అన్నదాన పథకానికి శ్రీకాకుళం వాస్తవ్యులు సింహాద్రి మంజులత రూ. 1,00,000 విరాళంగా అందజేశారు.
ఈరోజు మధ్యాహ్నం దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తికి విరాళం అందజేయగా, అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.
ఈ వివరాలను డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్ తెలిపారు.

# జనతా వారధిలో ప్రజల వినతులు స్వీకరణ

## ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబాటు



**నవతరం-శ్రీకాకుళం**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కల్పించే ఉద్దేశంతో శ్రీకాకుళం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కమిటీ సభ్యులు ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించి, వాటిని జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, ABBS నేషనల్ కన్వీనర్, నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ (BLA-1) పోకతోట సింహాచలం పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.
పార్టీ ఆదేశాల మేరకు మన ఊరు మన జెండా కార్యక్రమం కింద నరసన్నపేట నియోజకవర్గంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, జనతా వారధి కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలాస జిల్లా సాధన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

- ఉద్దానం వెనుకబాటుతనం పాలకులకు కనిపించడం లేదా?
- పలాస జిల్లా ఏర్పాటుతోనే ఉద్దానం అభివృద్ధి సాధ్యం
- సాలిన నరసింహ యాదవ్



**నవతరం-పలాస**

పలాస జిల్లా కేంద్ర సాధన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాలిన నరసింహ యాదవ్ తెలిపారు. సోమవారం పలాసలో ప్రముఖ సామాజికవేత్త, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ లిదువ్వాడ శ్రీధర్ (బాబా)ను మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్లో భాగంగా ప్రతి మనిషికి జీవించే హక్కు ఉన్నప్పటికీ, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడంలో పాలక వర్గాల వైఫల్యాల వల్లే ప్రాంతీయ అసమానతలు ఏర్పడుతున్నాయని అన్నారు. ఇతర ప్రాంతాలతో సమానంగా ఉద్యోగ, ఉపాధి, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ఉద్యమాలే మార్గమని పేర్కొన్నారు.
రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన నియోజకవర్గాలలో ఇచ్చాపురం ఒకటని, అలాగే ఉద్దానం ప్రాంతమైన పలాసలో కూడా కొన్ని ప్రాంతాలు వెనుకబాటుతనంతో పాటు వలసల అడ్డాగా మారాయని అన్నారు. వంశధార, నాగావళి నదుల జలాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమైపోయాయని, పలాసతో పాటు ఇచ్చాపురం నియోజకవర్గాలకు సాగు, తాగునీటి సౌకర్యాలు లేకపోవడం వల్ల అన్ని రంగాల్లో వెనుకబాటుతనం నెలకొందన్నారు.
జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ శ్రీకాకుళం జిల్లా పునర్విభజన జరగలేదని, కూటమి ప్రభుత్వం పలాస జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. దీంతో ఉద్దానం ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. సాగు, తాగునీరు లేకుండా ప్రజల జీవన ప్రమాణాలు ఎలా మెరుగుపడతాయని ప్రశ్నించిన ఆయన, వంశధార, మహేంద్రతనయ నదీ జలాలను ఇచ్చాపురం నియోజకవర్గ శివారు ప్రాంతాల వరకు అందించాలన్నారు. అందుకు పలాస జిల్లా సాధనతోనే ఈ ప్రాంత అభివృద్ధి ముడిపడి ఉందని స్పష్టం చేశారు.
స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు అభివృద్ధి ఫలాలకు నోచుకోని ప్రాంతంగా ఉద్దానం నిర్లక్ష్యం పాలైందన్నారు. పలాస జిల్లా ఏర్పడితే పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, సమీపంలోనే మూలపేట పోర్టు ఉండటం వల్ల మరింత పారిశ్రామిక వృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.
ఇచ్చాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు తదితర మండలాల ప్రజలు శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పరిపాలన సౌలభ్యం కోసం పలాస జిల్లా ఏర్పాటు అనివార్యమని అన్నారు.
జిల్లాకు చెందిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలాస, ఇచ్చాపురం నియోజకవర్గాల సమస్యలను గుర్తించి తక్షణమే పలాస జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.
పలాస జిల్లా ఏర్పాటు కోసం అన్ని వర్గాల ప్రజల నుంచి రోజురోజుకూ మద్దతు పెరుగుతోందని, ప్రజల ఆకాంక్షల మేరకు గొంతు వినిపిస్తున్న దువ్వాడ శ్రీధర్ (బాబా) కొనసాగిస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు.
కూటమి ప్రభుత్వం ఉద్దానం ప్రాంత ప్రజల ఆకాంక్షలను గౌరవించి వెంటనే పలాస జిల్లాను ప్రకటించాలని, లేకపోతే ఉద్యమాన్ని శాంతియుతంగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రక్తదానం అంటే ప్రాణదానం ఆపదలో ఉన్న వారికి ఆశాకిరణం

- చంద్రబాబు 76వ జన్మదినం సందర్భంగా 76 మంది రక్తదానం
- కోటబొమ్మాళిలో మెగా రక్తదాన శిబిరం



**నవతరం-కోటబొమ్మాళి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినోత్సవం సందర్భంగా కోటబొమ్మాళి మండలంలో మెగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు, కోటబొమ్మాళి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోయిన సత్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ రక్తదాన శిబిరాన్ని పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేస్తూ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. మండల అధ్యక్షులు బోయిన సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను విస్తరిస్తున్నామని తెలిపారు. వేసవి కాలంలో రక్త కొరతను అధిగమించేందుకు, థలసేమియా రోగులు మరియు రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ రక్తం అందించేందుకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని 76 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవా స్ఫూర్తిని చాటారు. ఈ కార్యక్రమంలో కోరాడు ప్రతాప్ కుమార్, రెడ్ క్రాస్ ప్రతినిధులు పి. చైతన్య కుమార్, కె. సత్యనారాయణ, జి. రమణ తదితరులు పాల్గొన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రాంగణ నియామకాలలో కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల హవా..

- ప్రతీ విద్యార్థి ఉన్నతస్థానంలో నిలవాలి
- కళాశాల డైరెక్టర్ బిఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్

**నవతరం-శ్రీకాకుళం**



ప్రతీ విద్యార్థి ఉన్నతస్థానంలో నిలవాలని, కొలువులకు సరైన వేదిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల అని డైరెక్టర్ బిఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ పట్టా అందుకోకముందే 20 మంది విద్యార్థులు ప్రముఖ ఐటి కంపెనీ కాగ్నిజెంట్ ప్రాంగణ నియామకాలలో ఉద్యోగాలు సాధించారన్నారు. ఇంటర్ తర్వాత ఎం చేయాలని ఆలోచించకుండా డిగ్రీలో తమ పిల్లలను చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్ కు దోహదపడాలని తల్లితండ్రులకు సూచించారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ కు దీటుగా కార్పొరేట్ కొలువులను డిగ్రీ మీద అందిపుచ్చుకుంటున్నారన్నారు. ఇందుకు కారణం డిగ్రీ మొదటి సంవత్సరం నుండే ఉద్యోగాలకు ఉపయోగపడే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతోందని, ప్రస్తుత రోజులలో సాఫ్ట్వేర్ రంగాలలో ఎంతో ప్రాధాన్యత ఉన్న కోడింగ్ విభాగంలో, విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని, విద్యార్థినిలకు ఉద్యోగాలు సాధించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. వీటితో పాటు ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, క్యాంపస్ కొలువులే కాకుండా అకడమిక్ పైన కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి యూనివర్సిటీ స్థాయి పరీక్షా ఫలితాలలో మొదటి స్థానాలలో నిలుస్తున్నామన్నారు. అనంతరం కొలువులు సాధించిన విద్యార్థినిలు మాట్లాడుతూ కాకినాడ ఆదిత్య మహిళా కళాశాలలో చదవటం మా అదృష్టమని, మొదటి సంవత్సరం నుండే ఇక్కడ అధ్యాపక బృందం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారని, వారి పట్టుదలతోనే మేము ఈ రోజు ఉన్నతస్థానంలో నిలిచామని, మా కళతో పాటు, తల్లితండ్రుల కళలను నెరవేర్చటం ఆనందంగా ఉందన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**